క్లుప్తంగా

బండి సంజయ్‌ని కలిసిన మెట్‌పల్లి నాయకులు


ఎంపీ సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ని హైదరాబాద్‌లో మెట్‌పల్లికి చెందిన పలువురు నాయకులు ఆదివారం కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మూడేళ్ల పూర్తి చేసుకున్న ఆయనకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, నాయకులు దొనికెల నవీన్, కుడుకల రఘు తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మంగారి కల్యాణం


కల్యాణంలో వెంకటరమణ దంపతులు

జగిత్యాలటౌన్: శ్రీగోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల కొత్తబస్టాండ్ సమీపంలోని పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయ సప్తమ సంవత్సర వార్షికోత్సవం, స్వామివారి కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ సత్యం, పట్టణ అధ్యక్షుడు సంకోజి వెంకటరమణ, కర్ర సంఘం అధ్యక్షుడు రాజు, గాజోజి నిరంజనచారి, శ్రీగాదె శ్రీనివాస్, పడకంటి నరహరి పాల్గొన్నారు.

ఇటిక్యాలలో మెగా వైద్యశిబిరం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఆదివారం గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. జగిత్యాలకు చెందిన డాక్టర్లు దురిశెట్టి శ్రీకాంత్, సురేశ్ కుమార్, ఆర్నాకుల రాము, మహేశ్‌రెడ్డి, నలవంచు రాజేశ్, శ్రీకాంత్‌రెడ్డి 700 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సామల్ల లావణ్య, ఎంపీటీసీ రాధ, సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి జలేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు గంగారెడ్డి, గ్రామంలోని మెడికల్ అసోసియేషన్, ఆర్‌ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా రాజారాం



మెట్‌పల్లి: పట్టణ పద్మశాలీ సేవా సంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక మార్కండేయ మందిరంలో జరిగాయి. అధ్యక్ష పదవికి జోగ రాజగంగారాం, ధ్యావనపల్లి రాజారాం, గాజెంగి సుదర్శన్ పోటీ పడ్డారు. వీరిలో అత్యధిక ఓట్లు సాధించిన ధ్యావనపల్లి రాజారాం గెలుపొందినట్లు ఎన్నికల అధికారి మ్యానాల రాజారాం తెలిపారు. అనంతరం సంఘం నాయకులు రాజారాంను సన్మానించారు.

ఆత్మరక్షణ పోటీల్లో ప్రతిభ


ధ్రువపత్రాలతో విద్యార్థులు

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లాస్థాయి సెల్ఫ్ డిఫెన్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు ఎంఈవో జమునా దేవి తెలిపారు. జగిత్యాలలో జరిగిన ఆత్మరక్షణ కిక్‌బాక్సింగ్ పోటీల్లో భాగంగా మల్లన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఆత్మరక్షణ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ఆమె పేర్కొన్నారు. వీరిని ఎంఈవో, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధిహామీ గుంతలో పడి గేదె మృతి

బుగ్గారం: మేత కోసమని వెళ్లిన గేదె ఉపాధిహామీ పనుల కోసం తవ్విన గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. బుగ్గారం మండల కేంద్రంలోని సల్ల రాయమల్లుకు చెందిన గేదె ఆదివారం మేత కోసమని వెళ్లింది. ప్రమాదవశాత్తు గోతిలో పడి మృతి చెందింది. దాని విలువ రూ.60వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బాధితుడు కోరుతున్నాడు.

నీడ లేదు.. తాగునీరు కరువు

- బస్టాండ్‌లో సౌకర్యాల లేమి
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


రాయికల్ పాత బస్టాండ్

రాయికల్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో నిలువ నీడ, తాగునీరు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎండాకాలం కావడంతో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయికల్ మండలంలోని 32 గ్రామాలకు చెందిన ప్రయాణికులు రాయికల్ పాతబస్టాండ్ నుంచి జగిత్యాల, నిర్మల్, కోరుట్లకు ప్రయాణిస్తుంటారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో షెడ్డు నిర్మాణం చేపడతామని ఇటీవల కోరుట్ల, జగిత్యాల డిపోలకు చెందిన మేనేజర్లు వచ్చి స్థలాన్ని పరిశీలించారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

ఎండలో నిలబడాల్సిన పరిస్థితి..

మున్సిపల్‌లో ఉన్న పాతబస్టాండ్‌లో ఎలాంటి షెడ్డు నిర్మాణం లేకపోవడంతో ప్రయాణికులు ఎండవేడిమి తట్టుకోలేక పరిసర ప్రాంతాల్లోని దుకాణాల్లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దాహం వేస్తే కనీసం నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో మంచినీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో గ్రీన్ మ్యాట్లు వేయడంతో కాస్త ఎండనుంచి రక్షణ పొందారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి యుద్ధప్రతిపాదికన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



రాయికల్ పాతబస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మున్సిపల్ ఆధ్వర్యంలో ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా షెడ్డు నిర్మాణం చేపట్టాలి.

– రాజేశ్, రాయికల్

చలివేంద్రం ఏర్పాటు చేస్తాం



రాయికల్ పాత బస్టాండ్‌తో పాటు గాంధీచౌక్ ఏరియాలో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. యువజన సంఘాలు, మున్సిపల్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

ఫుట్‌బోర్డు ప్రయాణమే దిక్కు

- దయనీయంగా కథలాపూర్ మండలంలోని విద్యార్థుల దుస్థితి


ఫుట్‌బోర్డు వద్ద ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులో ఫుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. మండలంలోని 19 గ్రామాలకు చెందిన విద్యార్థులు హైస్కూల్, జూనియర్ కళాశాలల చదువు కోసం కథలాపూర్ మండల కేంద్రానికి, డిగ్రీ చదువు కోసం కోరుట్లకు వెళ్తుంటారు. విద్యార్థులు విద్యాలయాలకు చేరుకునేలా ఉదయం, సాయంత్రం బస్సుల ట్రిప్పుల సంఖ్య పెంచాలని కోరుతున్నప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆయా గ్రామాలకు పాఠశాలల సమయానికి ఆర్టీసీ బస్సు ఒక్కసారే సౌకర్యం ఉండటంతో డోర్ వద్ద వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులో 'ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరం' అని రాసి ఉన్నప్పటికీ ప్రమాదకరమైన ప్రయాణం తప్పడంలేదని విద్యార్థులు అంటున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలు, కళాశాలల వేళల్లో గ్రామాల్లోని విద్యార్థుల కోసం అదనంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రేవంత్‌రెడ్డిని ఎవరూ నమ్మరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి జైలుకు వెళ్లి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతతో కలిసి ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను డబ్బులు తీసుకొని క్రాస్ ఓటింగ్ చేశానని కోరుట్ల బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన అధిష్టానం.. తప్పు చేయలేదని తెలుకొని తిరిగి పార్టీలోకి తీసుకుందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై వివాదాస్పద వాఖ్యలు చేయటం సిగ్గు చేటన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ చైర్ పర్సన్లు అన్నం లావణ్య, రానవేణి సుజాత, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, ఎంపీపీలు మారు సాయిరెడ్డి, తోట నారాయణ, కోరుట్ల పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో చేనేత సంఘం పునరుద్ధరణ

కోరుట్ల: ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కృషితోనే కోరుట్ల చేనేత సహకార సంఘం పునరుద్ధరణకు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి కేటీఆర్ అంగీకరించి లేఖ విడుదల చేశారని చేనేత సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావును కలిశారు. రాష్ట్ర చేనేత జౌళి శాఖ ద్వారా విడుదలైన లేఖను సంఘం నాయకులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1950లో 1268 మంది సభ్యులతో ఆవిర్భవించిన సంఘం చేనేత వస్త్రాల తయారీలో పేరు గాంచిందని, కానీ పలు మండలాలకు చెందిన సభ్యులు బొంబాయి, భీవండి వంటి నగరాలకు ఉపాధి కోసం వెళ్లడంతో సంఘం విచ్ఛిన్నమైందని తెలిపారు. తిరిగి పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. చేనేత సంఘం నాయకులు వాసం భూమానందం, రుద్ర సుధాకర్, గజెల్లి లక్ష్మయ్య, గోనె శంకర్, ద్యావనపెల్లి గంగాధర్ పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయాలి

ధర్మపురి: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశించారు. ఈ మేరకు ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రతి ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 17 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఉగాది ఉత్సవాలపై ఆదివారం సాయంత్రం జూనియర్ కళాశాల మైదానంలో మంత్రి స్థల పరిశీలన చేశారు. ఆరురోజుల పాటు నిర్వహించనున్న ఉగాది ఉత్సవాల ఏర్పాట్లపై స్థానిక నాయకులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతేడాది కంటే భిన్నంగా ఉత్సవాలు నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కోటేశ్వర్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ రమేశ్, నాయకులు చిలువేరు శ్యామ్‌సుందర్, అప్పాల వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


బోనాలతో మహిళలు

సారంగాపూర్: మండలంలోని నాగునూర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గ్రామంలోని బీఆర్ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలకు మహిళలు భారీ ఎత్తున తరలివచ్చారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్మ గంగు, బీఆర్‌ఎస్ నాయకులు బిట్ల రమేశ్, అనంతుల గంగారెడ్డి, దేవయ్య, మల్లయ్య, రాజయ్య, బాపయ్య పాల్గొన్నారు.


అద్దెకు తీసుకున్న వ్యవసాయ బావికి కొత్త మోటారు బిగిస్తున్న అన్నదమ్ములు

ఇది చి'వరి' ప్రయత్నం

సారంగాపూర్: రైతు ఎప్పటికీ కష్టజీవే. ఎందుకుంటే రైతు శ్రమ పడనిదే పంట చేతికి రాదు. దుక్కి దున్ని పంట వేసింది మొదలు పంట అమ్ముడయ్యే దాక కూడా శ్రమ పడాల్సిందే. కొక్కు ఉదయ్‌కుమార్, కొక్కు ఉపేందర్‌లు బట్టపల్లి గ్రామ శివారుల్లో వాళ్లకున్న 8 ఎకరాల పొలంలో వరిపంట వేశారు. అయితే తాము వేసిన వరిపంట సాగునీరు అందడం లేదు. పంటను కాపాడుకునేందుకు అన్నదమ్ములు ఇలా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం వరి పంట పూర్తిగా పొట్టదశలో ఉంది. బావిలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడం, ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీరు సక్రమంగా రాకపోవడంతో పొలం ఎండుతోంది. వీరికి సమీపంలో ఉన్న మరో రైతుకు చెందిన వ్యవసాయ బావిని అద్దెకు తీసుకున్నారు. వీరి పొలం నుంచి బావి దాదాపు కిలోమీటర్ దూరం ఉంటుంది. దీంతో బావికి కొత్తగా విద్యుత్ మోటారు, పైపులు, స్టార్టర్, ఇతర సామగ్రిని రూ.50వేలు వెచ్చించి కొనుగోలు చేసి తమ పంటకు నీరందించడానికి దీన్ని బిగిస్తున్నారు. పంట కాపాడుకోవడానికి ఈ ప్రయత్నం చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

నేత్రపర్వంగా పోచమ్మ బోనాలు


బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీరేణుక వెల్ఫేర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోచమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అన్నం అనిల్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫొటో స్టోరీ



ఓపెన్ జిమ్.. సరికొత్తగా

మల్యాల: మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, క్రీడా ప్రాంగణంతో మల్యాలకు సరికొత్త అందాలు తోడయ్యాయి. మల్యాల సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ చొరవ తీసుకుని, స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, షటిల్ కోర్టు, కబడ్డీ కోర్టు, ఇండోర్స్ గేమ్స్ క్యారమ్స్, చెస్, బాల్ బ్యాడ్మింటన్ ఆటలతో అదనపు అందాలు సమకూరాయి. ఆటస్థలం సమీపంలో వివిధ క్రీడాకారుల ఫొటోలు, ఓపెన్ జిమ్‌లో వ్యాయామం, యోగా చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

రైతులు, గంగపుత్రులు నష్టపోతున్నారు


రేచపల్లి ఊరచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రైతులు

సారంగాపూర్: రేచపల్లి ఊరచెరువులోకి ఎస్సారెస్పీ నీరు చేర్చడానికి పెద్ద పైపులను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని రేచపల్లి ఊర చెరువులోకి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు రాకపోవడంతో చెరువు కింద సాగు చేస్తున్న రైతులతో పాటు, చెరువులో చేపలు పెంచుతున్న గంగపుత్రులు నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఎస్సారెస్పీ డి–53, 12ఎల్ కాలువకు డీపీ6 దగ్గర గతంలో ఊరచెరువులోకి నీరు చేర్చడానికి ఏర్పాటు చేసిన పైపుల విస్తీర్ణం 9 అంగుళాలు మాత్రమే ఉందని, కనీసం 20 అంగుళాల పైపులు ఏర్పాటు చేసి, తూము నిర్మించాలని ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్‌ను కోరారు. దీనిపై వెంటనే అంచనా వేసి అందిస్తే నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఊరచెరువులో ఏర్పాటు చేసిన తాగునీటి బావిలోకి మురికి నీరు వచ్చి చేరుతోందని, దీనికి సిమెంట్ గాజులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా అందుకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో గంగపుత్రులు నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎండీ.ఇబ్రహీం, మోత్కూరి ప్రసాద్, మేడిపల్లి ఆనందరెడ్డి, బేర మహేశ్, ఆసాది రాజం, భూక్య పురుషోత్తం, కోండ్ర రాంచంద్రారెడ్డి, రాజిరెడ్డి తదితరున్నున్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న జెడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్ గ్రామంలో శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ఆలయం చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత రథోత్సవంలో పాల్గొన్నారు. సర్పంచ్ ఏళ్ల గంగనర్సు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


హాజరైన భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగ చిన్నరాజన్న–లావణ్య దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని అర్చకులు అత్యంత వైభవంగా, కనుల పండుగగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, ఎంపీటీసీలు ఆకుతోట రాజేశ్, మరిపెల్లి సత్తెమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ దీక్షదారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటం ఫలితమే జీవో 8 విడుదల


సమావేశమైన మధ్యాహ్న భోజనం నిర్వాహకులు

కోరుట్లటౌన్: ఐక్య పోరాటం ఫలితమే ప్రభుత్వం జీవో 8 విడదల చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని సి.ప్రభాకర్ భవన్‌లో మధ్యాహ్న భోజన కోరుట్ల మండల నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ 2022 మార్చి 15న అసెంబ్లీలో మధ్యాహ్న భోజనం నిర్వాహక కార్మికుల గౌరవ వేతనం రూ.వెయ్యి నుంచి రూ.3వేలు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటన చేశారని గుర్తు చేశారు. అయితే 10నెలలు గడిచినా ప్రభుత్వం జీవో విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో దశలవారీగా పోరాటాలు చేసిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 8, 2023న మధ్యాహ్న భోజన నిర్వాహక కార్మికుల వేతనం పెంపు జీవో 8 విడుదల చేసిందన్నారు. పెంచిన గౌరవ వేతనం రూ.3 వేలు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మండల ప్రతినిధులు కొంక భాగ్య, పోషక్క, పద్మ, విజయ, గంగు, కొంతం రాజె, హైమది బేగం, తస్లీమా సుల్తానా, సఫియా, హారిక, గంగు తదితరులు పాల్గొన్నారు.